సాక్షి
విశాఖపట్నం
సోమవారం । 13 । ఫిబ్రవరి । 2023



రామ్‌చరణ్ సందడి

శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న ఆర్‌సీ 15 సినిమా షూటింగ్‌లో నటుడు రామ్‌చరణ్ పాల్గొన్నారు. 10లో



కష్టపడితే అనుకున్నది సాధ్యం

కష్టపడితే అనుకున్నది సాధించవచ్చని 'సాక్షి' ప్రీమియర్ లీగ్ ప్రాంతీయ పోటీలకు విచ్చేసిన కలెక్టర్ మల్లికార్జున అన్నారు. 8లో



కేజీహెచ్‌కు న్యూ లుక్

పేదల ఆస్పత్రిగా పేరొందిన కేజీహెచ్‌లో రోగులకు మెరుగైన సౌకర్యాలతో కూడిన వైద్యం అందుతోంది. 8లో

న్యూస్‌రీల్

మహా శివరాత్రికి విశేష ఏర్పాట్లు



నక్కవానిపాలెంలోని ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయం

మహారాణిపేట: మహా శివరాత్రి పురస్కరించుకుని జిల్లాలోని శివాలయాల్లో విశేష ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెల 18న శని త్రయోదశి కూడా రావడంతో పరమేశ్వరుడికి, నవ గ్రహాలకు పూజలు చేసేందుకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉంది. ఆ రోజు పూర్ణామార్కెట్‌లోని శ్రీ దుర్గాలమ్మ ఆలయం, అప్పికొండ శివాలయానికి వేల సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. వీటితో పాటు మరో 15 శివాలయాలకు భక్తులు తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో రెండు రోజుల పాటు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని దేవదాయశాఖ జిల్లా సహాయ కమిషనర్ కె.శిరీష అధికారులను ఆదేశించారు. మహాశివరాత్రి పురస్కరించుకుని పలు ఆలయాలకు డిప్యూటేషన్‌పై సిబ్బందిని నియమిస్తున్నారు.

క్షతగాత్రులకు కొనసాగుతున్న చికిత్స

- ఆస్పత్రి నుంచి కాంట్రాక్ట్ కార్మికుని డిశ్చార్జ్
- విభాగంలో ఉత్పత్తి పునరుద్ధరణ

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ ఎస్‌ఎంఎస్–2 విభాగ ప్రమాద క్షతగాత్రులకు నగరంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స కొనసాగుతోంది. గాయపడిన వారి పరిస్థితి నిలకడగా ఉన్నట్టు తెలిసింది. స్టీల్‌ప్లాంట్ స్టీల్ మెల్ట్ షాప్‌లో శనివారం మధ్యాహ్నం జరిగిన పేలుడు సంఘటనలో పది మంది గాయపడిన విషయం తెలిసిందే. వారిని చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతున్నారు. గాయపడిన పది మందిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని చెప్పినప్పటికీ వారు కూడా కోలుకుంటున్నారని సమాచారం. ఇదిలా ఉండగా సంఘటన స్థలాన్ని స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్‌భట్ పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారని విభాగం ఉద్యోగులు తెలిపారు. ప్రమాదం జరిగిన తీరుపై అధికారులతో చర్చించారు. ప్రమాదంలో గాయపడిన కాంట్రాక్ట్ కార్మికుడు అప్పలరాజును ఆస్పత్రి నుంచి ఆదివారం డిశ్చార్జ్ అయ్యాడు. కాగా విభాగంలో ఉత్పత్తిని ఆదివారం యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించారు.

ఆపరేషన్ స్వేచ్ఛతో బాలలకు విముక్తి

అల్లిపురం (విశాఖ దక్షిణం): 'వెట్టి చాకిరీ పని విధానం, వ్యక్తి స్వాతంత్య్రాన్ని పరిరక్షిద్దాం' అనే నినాదంతో 'ఆపరేషన్ స్వేచ్ఛ' స్పెషల్ డ్రైవ్ ఈనెల 15 వరకు జరుగుతుందని నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ తెలిపారు. ఆపరేషన్ స్వేచ్ఛ కార్యక్రమంలో భాగంగా 20 మంది బాలబాలికలను కాపాడినట్లు పేర్కొన్నారు. ఇందులో 18 మంది బాలురు, ఇద్దరు బాలికలు ఉన్నారన్నారు. వీరిలో 12 మందిని వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి అప్పగించినట్లు తెలిపారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి ఎనిమిది మందిని అప్పగించామన్నారు.

సాగరతీరం.. కోలాహలం



నగరంలోని పర్యాటక ప్రాంతాలకు ఆదివారం సందర్శకులు పోటెత్తారు. ఆర్.కె.బీచ్, సాగర్‌నగర్, రుషికొండ తదితర బీచ్‌లకు నగరవాసుల తమ కుటుంబాలతో వచ్చి సేదతీరారు. వరుసగా రెండు రోజులు సెలవులు రావడంతో.. ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు నగరానికి తరలివచ్చారు. దీంతో బీచ్‌రోడ్డులోని వీఎంఆర్‌డీఏ పార్కు, టీయూ 142 యుద్ధ విమానం, కురుసుర మ్యూజియం, విశాఖ మ్యూజియం పర్యాటకులతో సందడిగా కనిపించాయి. తమ పర్యటనలో తీపి జ్ఞాపకాలను సెల్‌ఫోన్లలో బంధించుకుని.. సందర్శకులు ఎంజాయ్ చేశారు. – బీచ్‌రోడ్డు

డ్రెడ్జింగ్ పనులకు నేడు శ్రీకారం



డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(డీసీఐ) ఆధ్వర్యంలో ఆర్.కె.బీచ్‌లో ఇసుకను బయటకు తోడే పనులు సోమవారం ప్రారంభం కానున్నాయి. సముద్రంలో ఇసుక మేటలు వేయడం వల్ల.. కెరటాలు ముందుకు వస్తుంటాయి. దీని వల్ల తీరం కోతకు గురవ్వడంతో పాటు సముద్రంలో భారీ నౌకల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతాయి. ఈ ఇబ్బందులను పరిష్కరించేందుకు డీసీఐ సముద్రంలోని ఇసుకను పైపుల ద్వారా తీరం ఒడ్డుకు చేర్చుతుంది. రూ.20 కోట్లతో నెల రోజుల పాటు పనులు జరగనున్నాయి. ఆదివారం కాసేపు సముద్రంలో ఇసుకను తవ్వి పైపుల ద్వారా తీరంలోకి చేర్చారు. – బీచ్‌రోడ్డు

ఆ భూములు ఇక సెటిల్డ్.!

స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి ఆ గ్రామాలు ఇంకా సెటిల్ కాలేదు. అక్కడి భూములు అడంగళ్‌లో కనిపించవు.. వెబ్‌ల్యాండ్‌లోనూ ఉండవు. రిజిస్ట్రేషన్లు జరగవు. రైతుల ఆధీనంలో ఉన్నా.. వారికి హక్కులు లేవు. ఇకపై ఇలాంటి ఇబ్బందులు ఎదురవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం చారిత్రక నిర్ణయం తీసుకుంది. జిల్లాలోని 11 అన్‌సెటిల్డ్ గ్రామాలపై దృష్టిసారించిన ప్రభుత్వ యంత్రాంగం.. భూ రీ సర్వేతో గుర్తింపు తీసుకొచ్చే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. దేవస్థానం పరిధిలోని గ్రామాలు మినహా.. మిగిలిన గ్రామాల్లో రైతులకు భూ హక్కులు కల్పించే మంచి రోజులు తొందర్లోనే రానున్నాయి.

– సాక్షి, విశాఖపట్నం

- రికార్డుల్లో లేని 11 గ్రామాలకు చెందిన భూములు
- ఇందులో సింహాచలం దేవస్థానానికి చెందిన పంచగ్రామాలు
- పద్మనాభం మండలంలో 3, భీమిలిలో 1, ఆనందపురంలో 2
- భూ రీసర్వేతో రికార్డుల గుర్తింపునకు చర్యలు
- అర్హత ఉన్న రైతులకు భూహక్కు కల్పించేందుకు ప్రణాళికలు



బోనిలో అన్‌సెటిల్డ్ భూములు

బ్రిటిష్ కాలంలో దేశవ్యాప్తంగా మొత్తం భూమిని సర్వే చేసినప్పుడు సర్వే నంబర్ల వారీగా ఎంత భూమి ఉందనేది రీసర్వే సెటిల్‌మెంట్ రిజిస్టర్(ఆర్‌ఎస్‌ఆర్)లో నమోదు చేశారు. అయితే అనేక ప్రాంతాల్లో ఆర్‌ఎస్‌ఆర్, అడంగళ్ల మధ్య భూ వ్యత్యాసం కనిపిస్తోంది. అలాగే అడంగళ్లు, భూమి కొలతల పుస్తకం(ఎఫ్‌ఎంబీ) మధ్య కూడా తేడా స్పష్టంగా ఉన్నట్లు తేలింది. ఇలా తప్పుల తడకగా ఉన్న భూ రికార్డుల స్వచ్ఛీకరణకు రాష్ట్ర ప్రభుత్వం భూముల సమగ్ర రీ సర్వే నిర్వహిస్తోంది. ఈ మేరకు జిల్లాలోని 11 గ్రామాల్లోని చాలా భూములకు సంబంధించి రికార్డుల్లో అన్‌సెటిల్డ్ అని రాసి ఉండటంతో వాటిపై ప్రధానంగా దృష్టి సారించారు.

దేవస్థాన గ్రామాల మినహా..

జిల్లాలో 11 గ్రామాలు అన్‌సెటిల్డ్ విలేజ్‌లుగా ఉన్నాయి. ఇందులో ఉన్నవి ప్రభుత్వ భూములా? దేవస్థానం భూములా? జిరాయితీ భూములా అనేది రికార్డుల్లో స్పష్టత లేదు. ఇలా సెటిల్ కాకుండా పోవడం వల్ల ఆ భూములకు సంబంధించి ఎలాంటి రిజిస్ట్రేషన్లు జరగవు. అనధికారికంగా విక్రయించాలి కానీ.. దానికి కూడా హక్కులేదు. పైగా తక్కువ ధరకు భూములను అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉంది. మొత్తం 11 గ్రామాల్లో 5 సింహాచలం పరిధిలో ఉన్న పంచగ్రామాలుగా గుర్తించారు. వీటితో పాటు పద్మనాభం మండలం పద్మనాభం గ్రామంలో 150 ఎకరాలు, కృష్ణాపురంలో 1,600, బి.తాళ్లవలసలో 1,200 ఎకరాలున్నాయి. ఇవి ఆయా ఆలయాల పరిధిలో ఉన్నట్లుగా స్పష్టమైంది. కాబట్టి ఈ గ్రామాల్ని మినహాయించారు. అయితే ఆనందపురం మండలంలోని శిర్లపాలెంలో 265.52 ఎకరాలు, బోనిలో 1235.70 ఎకరాలు, భీమిలిలో నారాయణరాజుపేటలో 234 ఎకరాలు అన్‌సెటిల్డ్ పరిధిలో ఉన్నాయి. ఈ గ్రామాల్లో రికార్డులకు స్వచ్ఛీకరణ చేపట్టి రైతులకు హక్కు కల్పించాలని నిర్ణయించారు. బోని, శిర్లపాలెం, నారాయణరాజు పేటలో మూడు నెలలుగా రీసర్వే నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు అనుభవిస్తున్న వారికి నోటీసులు జారీ చేశారు. ఈ భూములు ప్రస్తుతం కొందరు రైతులు ఆధీనంలో, మరికొంత భూములు మాన్యాస్, దేవస్థానం, ఇనాం, ప్రభుత్వాధీనంలో ఉన్నాయి. ఎవరెవరు ఈ భూములను అనుభవిస్తున్నారు. ఎప్పటి నుంచి అనుభవిస్తున్నారు? వాటికి సంబంధించిన డాక్యుమెంట్లు తదితర వివరాలు సేకరించే పనిలో అధికారులు ఉన్నారు. వాటిని క్షుణ్ణంగా పరిశీలించి.. అర్హులైన రైతుల పేరు మీద ఆయా గ్రామాల్లోని భూములను బదలాయించనున్నారు.



శిర్లపాలెంలో భూములను పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున(ఫైల్)

1945 కట్ ఆఫ్ డేట్‌గా పెట్టాం



అన్‌సెటిల్డ్ గ్రామాలకు సంబంధించిన భూముల వివరాలు వెబ్‌ల్యాండ్, అడంగళ్, ఎఫ్‌ఎంబీల్లోనూ లేవు. 10 ఏళ్ల కిందట వరకు ఈ భూముల్లో రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఆ తర్వాత ప్రభుత్వం నిలుపుదల చేసింది. అందుకే వాటికి సంబంధించి హక్కులు కల్పించేందుకు చర్యలు చేపట్టాం. 1945 సంవత్సరాన్ని కటాఫ్ డేట్‌గా పెట్టాం. అప్పటి నుంచి ఎవరి ఆధీనంలో ఉన్నాయనేదాన్ని పరిశీలిస్తున్నాం. వారి వద్ద నుంచి కొందరు భూములు కొనుగోలు చేశారు. రిజిస్ట్రార్, అన్ రిజిస్ట్రార్ కొనుగోళ్లకు సంబంధించిన డాక్యుమెంట్లను క్షుణ్ణంగా పరిశీలించి.. అర్హులకు పట్టాలు అందజేయనున్నాం. ఇలాంటి డాక్యుమెంట్లు లేని వారి గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని.. భూములను ఎప్పటి నుంచి అనుభవిస్తున్నారనే వివరాలకనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటాం. ఏప్రిల్ నాటికల్లా ప్రక్రియ పూర్తి చేసే దిశగా చర్యలు వేగవంతం చేశాం.

– కె.ఎస్.విశ్వనాథన్, జాయింట్ కలెక్టర్

ఇద్దరు యువకుల దుర్మరణం

మద్యం మత్తులో బైక్‌ను ఢీకొనడంతో ఘటన



దినేష్ (ఫైల్)





దినేష్, రామిరెడ్డి మృతదేహాలు



రామిరెడ్డి(ఫైల్)

మద్దిపాలెం: జ్ఞానాపురం వద్ద శనివారం అర్ధరాత్రి దాటాక రెండు బైకులు ఢీకొన్న ప్రమాదం.. రెండు కుటుంబాల్లో విషాదం నింపింది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులకు నిండు నూరేళ్లు నిండిపోయాయి. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పోలీసులు తెలిపిన వివరాలివీ..

బర్మాకాలనీ దరి పట్టాభిరెడ్డి గార్డెన్స్‌కు చెందిన దలిబాని దినేష్(27) సీపోర్టులో సివిల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. రోజూ మాదిరి విధులు ముగించుకుని రాత్రి ఇంటికి వెళ్తున్నాడు. సింహాచలం అడవివరం ప్రాంతానికి చెందిన రాజనాల రామిరెడ్డి(22) మద్యం మత్తులో మితిమీరిన వేగంతో వాహనం నడుపుతూ జ్ఞానాపురం వైపు వస్తున్నాడు. దినేష్ జ్ఞానాపురం జీఎస్‌యూఆర్‌ఎం వద్దకు వచ్చేసరికి ఆయన బైక్‌ను రామిరెడ్డి తన బైక్‌తో ఢీకొట్టాడు. ఈ ఘటనలో దినేష్, రామిరెడ్డి అక్కడికక్కడే మృతి చెందారు. రామిరెడ్డి వెనుక కూర్చున్న సాయి సాగర్‌కు గాయాలయ్యాయి. అతనికి కేజీహెచ్‌లో చికిత్స అందిస్తున్నారు. ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్ మార్చురీకి తరలించారు. కాగా.. దినేష్ నరవలోని విశాఖ ఇన్‌స్టిట్యూట్‌లో సివిల్ ఇంజినీరింగ్ డిప్లమో పూర్తి చేశాడు. సీపోర్టులో ప్రస్తుతం ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి ఓ సోదరుడు ఉన్నట్టు పోలీసులు తెలిపారు. పాత అడవివరానికి చెందిన రామిరెడ్డి తండ్రి భైరవుడు ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. అతనికి రామిరెడ్డి ఒక్కడే సంతానం. రామిరెడ్డి ఓ కంపెనీలో వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. పాత అడవివరానికే చెందిన పిల్ల సాయి సాగర్ కూడా రామిరెడ్డితోపాటే పని చేస్తున్నాడు. వీరిద్దరూ శనివారం రాత్రి గోపాలపట్నం దరి కొత్తపాలెంలో ఓ పండక్కి వెళ్లారు.

అక్కడ మద్యం సేవించి.. తినడానికి ఏమీ దొరక్కపోవడంతో విశాఖ రైల్వేస్టేషన్ వద్దకు టిఫిన్ తిందామని వెళ్లారు. ఈ క్రమంలో ప్రమాదం చోటుచేసుకుంది. వెస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, కంచరపాలెం సీఐ, ఎస్‌ఐ ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. సీఐ విజయ్‌కుమార్ నేతృత్వంలో ఎస్‌ఐ షేక్ షమీర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తీరంలో మరింత భద్రత



బీచ్‌లో టూరిస్ట్ పోలీస్‌స్టేషన్



ట్రయల్ రన్‌కు సిద్ధంగా ఉన్న ద్విచక్రవాహనాలు, మినీ ట్రాక్టర్లు

అందుబాటులో 10 బైక్‌లు, రెండు బీచ్ పెట్రోలింగ్ ట్రాక్టర్లు

బీచ్‌రోడ్డు: విశాఖ సాగరతీరంలో పర్యటనకు వచ్చే సందర్శకులకు నగర పోలీసులు మరింత భద్రతనిచ్చేందుకు చర్యలు చేపట్టారు. ఇప్పటికే బీచ్‌రోడ్డులో దిశ టీంలు నిరంతరం పహారా కాస్తున్నాయి. బీచ్ అవుట్ పోస్టులు ఉన్నాయి. వాటికి అదనంగా టూరిస్ట్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేశారు. దీంతో పాటు నిరంతరం తీరంలో గస్తీ కాసేందుకు 10 ద్విచక్ర వాహనాలు, ఇసుకలో పెట్రోలింగ్ చేసేందుకు రెండు మినీ ట్రాక్టర్లను సిద్ధం చేశారు. ఈ మేరకు ఆదివారం బీచ్‌లో వీటితో విజయవంతంగా ట్రయల్ రన్ నిర్వహించారు. త్వరలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా వర్చువల్‌గా వీటిని ప్రారంభించనున్నారు.

మన బడికి పోదాం

విశాఖ విద్య: అందరికీ విద్య అందించాలన్న ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా డ్రాపవుట్స్ పిల్లలపై అధికార యంత్రాంగం దృష్టి సారించింది. జిల్లాలో 1,558 మంది పిల్లలు బడి బయట ఉన్నట్లు లెక్క తేలగా.. సమగ్ర శిక్ష అభియాన్ అధికారుల వీరి పూర్తి వివరాలను ఇప్పటికే సేకరించారు. ఇందులో 397 మందిని పాఠశాలల్లో చేర్పించారు. మిగిలిన వారు ఎందుకు బడిబయట ఉన్నారనేది క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత.. సమగ్ర వివరాలను ఉన్నతాధికారులకు నివేదించారు. గ్రామస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసి బడిబయట పిల్లల వాస్తవ పరిస్థితులపై మరోమారు క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా ధ్రువీకరించాలని సమగ్ర శిక్ష రాష్ట్ర డైరెక్టర్ సురేష్‌కుమార్ ఈ నెల 11 జారీ చేసిన ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో జిల్లాలో స్పెషల్ డ్రైవ్ నిర్వహణకు జిల్లా విద్యా శాఖాధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు.

అందరికీ విద్య లక్ష్యం

- బడిబయట పిల్లల కోసం స్పెషల్ డ్రైవ్
- జిల్లాలో 1,558 మంది గుర్తింపు
- సమగ్ర సర్వేకు సిద్ధమైన యంత్రాంగం

బడి బయట పిల్లల వివరాలివీ..

జిల్లాలో బడిబయట ఉన్న 1,558 మంది విద్యార్థులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఆనందపురం–30, భీమునిపట్నం–52, చినగదిలి–268, గాజువాక–239, పద్మనాభం–9, పెదగంట్యాడ–44, పెందుర్తి–232, విశాఖ పట్నం అర్బన్‌లో 684 మంది బడి ఈడు పిల్లలు డ్రాపవుట్లుగా ఉన్నట్లు లెక్క తేల్చారు. సమగ్ర సర్వే ఆధారంగా వీరి వాస్తవ పరిస్థితులను తెలుసుకున్నారు. 21 మందికి చైల్డ్ మ్యారేజ్ కాగా.. 50 మంది పేర్లు రెండు చోట్ల నమోదయ్యాయి. ఒకరు మృతి చెందారు. 11 మందికి ఆరోగ్య పరమైన సమస్యలున్నాయి. 63 మంది బడిలో చేరేందుకు అయిష్టత వ్యక్తం చేయగా, జిల్లాకు వలస వచ్చిన వారిలో 856 మంది తిరిగి వారి స్వగ్రామాలకు వెళ్లిపోయినట్లుగా గుర్తించారు. 12 మంది ఓపెన్ స్కూల్స్‌లో చదువుతుండగా, 147 మందికి బడి ఈడు వయసు దాటారు. వీరిలో ఇప్పటికే 397 మందిని పాఠశాలల్లో చేర్పించారు.

సచివాలయాల్లో మ్యాపింగ్

బడిబయట ఉన్న 1,558 మంది పిల్లలను వారి ఆధార్ కార్డు అనుసంధానంతో సచివాలయాల్లో మ్యాపింగ్ చేశారు. ఇప్పటికే 1,158 మంది మ్యాపింగ్ ప్రక్రియ పూర్తయింది. డ్రాపవుట్ అనేది లేకుండా 'మన బడికి పోదాం'యాప్‌లో వివరాలను నమోదు చేయాలని స్పష్టం చేశారు. ఎంపీడీవో, తహసీల్దార్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం, కేజీబీవీ, సీఆర్పీ, ఐఈఆర్టీ, అంగన్‌వాడీల మొబైల్ ఫోన్లలో 'మన బడికి పోదాం'యాప్‌ను డౌన్‌లోడ్ చేయనున్నారు. ఇందుకోసం జిల్లా, డివిజన్, మండల, గ్రామ స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేస్తారు. గ్రామస్థాయిలో ఏర్పాటు చేసిన కమిటీకి పాఠశాల హెచ్‌ఎం మెంబర్ కన్వీనర్‌గా, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ కీలక మెంబర్‌గా పనిచేయనున్నారు. వీఆర్వో, గ్రామ కార్యదర్శి, సీఆర్పీ, సచివాలయ ఎడ్యుకేషన్ అసిస్టెంట్, గ్రామ/వార్డు వలంటీర్, అంగన్‌వాడీ కార్యకర్త సభ్యులుగా ఉంటారు.



న్యూ కాలనీలో డ్రాపవుట్‌గా గుర్తించిన విద్యార్థిని బడిలో చేర్పిస్తున్న సీఆర్పీ

పక్కాగా సర్వే



బడిఈడు పిల్లలను శత శాతం ఎన్‌రోల్‌మెంట్ దిశగా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. గుర్తించిన పిల్లలను వెంటనే బడిలో చేర్పిస్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బడిబయట పిల్లల సర్వేను పక్కాగా చేపట్టేలా కార్యాచరణ సిద్ధం చేశాం.

– వానపల్లి శైలజ, జిల్లా కో–ఆర్డినేటర్, ప్రత్యామ్నాయ పాఠశాలలు

'అమృత్ భారత్ స్టేషన్'గా దువ్వాడ

- మారనున్న రైల్వేస్టేషన్ రూపురేఖలు
- 53 రకాల ప్రాథమిక సౌకర్యాలు, వసతుల కల్పనకు మాస్టర్‌ప్లాన్



దువ్వాడ రైల్వేస్టేషన్

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ రూపురేఖలు మారనున్నాయి. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జాబితాలో దువ్వాడ రైల్వేస్టేషన్‌కు చోటు దక్కింది. దశాబ్దంన్నర కిందట ఆదర్శ రైల్వేస్టేషన్ జాబితాలో దువ్వాడను చేర్చి నాలుగో నంబర్ ప్లాట్‌ఫాం విస్తరణ, ఎత్తు పెంచడం, రెండవ వైపు ముఖద్వారం నిర్మాణం, పార్కింగ్ షెడ్ల నిర్మాణం చేపట్టారు. తాజా ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో అమృత్ భారత్ స్టేషన్ల పథకంలో భాగంగా ఎంపిక చేసిన స్టేషన్లలో 53 రకాలైన ప్రాథమిక, మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు కేంద్రమంత్రి ప్రకటించారు. ఆ స్టేషన్ల భౌగోళిక పరిస్థితిని బట్టి మాస్టర్ ప్లాన్‌ను రూపొందించనున్నారు. తర్వాత ఏఏ రకాల వసతులు అవసరమో గుర్తించి.. ఒక్కొక్కటిగా కల్పించనున్నారు.

పథకం ఉద్దేశమిదీ..

- ఎంపికైన స్టేషన్‌లో ఆధునిక రీతిలో భవనాలు, పార్కింగ్ షెడ్ల నిర్మాణం
- ప్రస్తుతం ప్లాట్‌ఫాంల పొడవు(600)ను 760 నుంచి 840 మీటర్ల వరకు పెంచుతారు
- స్టేషన్ ఆవరణలో పరిశుభ్రత కోసం సులభమైన నిర్వహణ కోసం బ్యాలస్ట్‌లెస్ ట్రాక్ ఏర్పాటు
- ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఎన్‌ఎస్‌జీ 1–4, ఎస్‌జీ 1–2 కేటగిరీలుగా విభజించి ఎస్కలేటర్లు ఏర్పాటు
- దివ్యాంగుల సౌకర్యం కోసం ప్రత్యేక వీల్‌ఛైర్ల మార్గాల నిర్మాణం
- వసతి గృహాలు, వాటికి అనుబంధంగా కేఫ్‌టేరియా ఏర్పాటు
- స్థానిక ఉత్పత్తుల విక్రయాలకు స్టాళ్ల ఏర్పాటు
- స్టేషన్ మొదటి అంతస్తులో ప్రత్యేకంగా రూఫ్ ప్లాజా
- ప్రత్యేక సమావేశ మందిరాలు
- స్టేషన్‌కు రెండువైపులా అప్రోచ్ రోడ్లు, పాదచారులకు ప్రత్యేక దారి
- ల్యాండ్ స్కేపింగ్, అధునాతన విద్యుద్దీపాల వెలుగులు
- వేగవంతమైన వైఫై కోసం 5జీ టవర్లు ఏర్పాటు

వీటితోపాటు మరిన్ని మెరుగైన సేవలు అందుబాటులో తెచ్చేందుకు ఈ పథకం అమల్లోకి తీసుకొస్తున్నారు. దువ్వాడ రైల్వేస్టేషన్‌లో రోజు రోజుకూ ప్రయాణికుల రద్దీ పెరుగుతోంది. అయితే సౌకర్యాలు మాత్రం అంతంత మాత్రంగా ఉన్నాయని ప్రజా సంఘాలు, ప్రయాణికులు గగ్గోలు పెడుతూ.. నిరసన తెలుపుతున్నారు. ఈ క్రమంలో అమృత్ భారత్ స్టేషన్ పథకంలో దువ్వాడ స్టేషన్‌ను ఎంపిక చేయడంతో.. ఈ ప్రాంత వాసుల్లో ఆశలు చిగురించాయి.

అలా చూడు.. ప్రేమలోకం.. పిలుస్తున్నదీ..



ప్రేమ గూటికి పండగ రోజు సమీపించింది. వలపు జంటల్ని ఆకర్షించేందుకు వాలెంటైన్స్ డే గిఫ్ట్‌లతో తమ దుకాణాల్ని అలంకరిస్తున్నారు. ఇదిగో అక్కయ్య పాలెం మెయిన్‌రోడ్డులోని ఓ గిఫ్ట్ దుకాణాన్ని ఇలా ప్రేమమయం చేసేశారు. రోడ్డుపై నుంచి చూడగానే ప్రేమికులకే కాదు.. ప్రతి ఒక్కరికీ గుండెల్లో గులాబీ ముల్లు గుచ్చుకునేలా.. హార్ట్ సింబల్స్ రారమ్మని పిలుస్తున్నాయి. వాలెంటైన్స్ డే కోసం.. ప్రేమికుల్ని ఆకర్షించేందుకు దుకాణాన్ని ఐదు రోజుల పాటు కష్టపడి ఈ విధంగా డిజైన్ చేసినట్లు న్యూ షాప్ యజమాని కిరణ్ చెబుతున్నారు. - సీతంపేట / సాక్షి ఫొటోగ్రాఫర్







కష్టపడితే అనుకున్నది సాధ్యం



సీనియర్స్ రన్నరప్ ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల



జూనియర్స్ విజేత సాయిగణపతి పాలిటెక్నిక్



జూనియర్స్ రన్నరప్ శ్రీ ప్రకాష్ జూనియర్ కళాశాల



కలెక్టర్ నుంచి ట్రోఫీ స్వీకరిస్తున్న సీనియర్స్ విజేత ఎంవీజీఆర్ కళాశాల

- కలెక్టర్ మల్లికార్జున
- రాష్ట్రస్థాయి పోటీలకు ఎంవీజీఆర్, ఎస్జీపీ జట్ల అర్హత
- ముగిసిన 'సాక్షి' ప్రీమియర్ లీగ్ ప్రాంతీయ పోటీలు

విశాఖ స్పోర్ట్స్: బాధ్యతగా కష్టపడితే అనుకున్నది సాధించవచ్చని విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. 'సాక్షి'ప్రీమియర్ లీగ్ ప్రాంతీయ పోటీల ముగింపు కార్యక్రమానికి విచ్చేసిన ఆయన క్రీడాకారులనుద్దేశించి మాట్లాడారు. పని మీద చిత్తశుద్ధితో దృష్టి సారిస్తే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చన్నారు. క్రికెటర్ భరత్ జిల్లా స్థాయి నుంచి నేడు భారత జట్టుకు ఆడే స్థాయికి ఎదిగాడని ఉదహరించారు. కాగా.. 'సాక్షి'ప్రీమియర్ లీగ్(ఎస్పీఎల్) క్రికెట్ రాష్ట్రస్థాయి పోటీలకు సీనియర్స్ విభాగం నుంచి ఎంవీజీఆర్ కళాశాల(విజయనగరం)జట్టు, జూనియర్స్ విభాగం నుంచి సాయిగణపతి పాలిటెక్నిక్ జట్టు అర్హత సాధించాయి. ఏయూ గోల్డెన్ జూబ్లీ మైదానంలో ఆదివారం జరిగిన ప్రాంతీయ స్థాయి పోటీల ఫైనల్‌లో ప్రభుత్వ మెన్ ఆర్ట్స్ కళాశాల(శ్రీకాకుళం) జట్టుపై తొమ్మిది వికెట్ల తేడాతో ఎంవీజీఆర్ కళాశాల(విజయనగరం) జట్టు, సాయిగణపతి పాలిటెక్నిక్(గిడిజాల) జట్టు 16 పరుగుల తేడాతో శ్రీ ప్రకాష్ జూనియర్ కళాశాల(పెద్దాపురం) జట్టుపై విజయం సాధించాయి.

'సాక్షి'మీడియా ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ పోటీల్లో శ్రీకాకుళం, విజయనగరం, తూర్పుగోదావరి, విశాఖ ఉమ్మడి జిల్లాల విజేతలుగా నిలిచిన సీనియర్స్, జూనియర్స్ జట్లు పోటీపడ్డాయి. ముగింపు కార్యక్రమంలో 'సాక్షి' బ్యూరో చీఫ్ కె.జి. రాఘవేంద్రరెడ్డి, యాడ్స్ డీజీఎం శ్రీనివాసరావు, బ్రాంచ్ మేనేజర్ చంద్రరావు, 'సాక్షి'టీవీ సీనియర్ కరస్పాండెంట్ రామచంద్రరావు పాల్గొన్నారు. ప్రాంతీయ పోటీల్లో విజేతలకు కలెక్టర్ ట్రోఫీలు, సర్టిఫికెట్లు బహూకరించారు.

బౌలర్లు బెంబేలెత్తించారు : సీనియర్స్ విభాగంలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో టాస్ ఓడిన ప్రభుత్వ మెన్ ఆర్ట్స్ కళాశాల(శ్రీకాకుళం) జట్టు తొలుత బ్యాటింగ్ చేసింది. నిర్ణీత 10 ఓవర్లకు మరో రెండు బంతులుండగానే 59 పరుగులకు ఆలౌటైంది. జయంత్ మూడు, కల్యాణ్ రెండు, సురేష్ ఒక వికెట్ తీసి బ్యాటర్లను బెంబేలెత్తించారు. ప్రతిగా ఎంవీజీఆర్ కళాశాల జట్టు(విజయనగరం) ఒకే వికెట్ కోల్పోయి 7.1 ఓవర్లలోనే విజయలక్ష్యాన్నందుకుంది. కిరీటీ 24 పరుగులు చేశాడు. యశ్వంత్ ఒక వికెట్ తీయగలిగాడు.

కష్టపడ్డారు

జూనియర్స్ విభాగంలో టాస్ గెలిచిన శ్రీ ప్రకాష్ జూనియర్ కళాశాల జట్టు లక్ష్య ఛేదనకే మొగ్గు చూపింది. దీంతో తొలుత బ్యాటింగ్ చేసిన సాయిగణపతి పాలిటెక్నిక్ జట్టు 10 ఓవర్లకు ఎనిమిది వికెట్లు కోల్పోయి 84 పరుగులు చేసింది. నూకేష్ 29, కుమార్ 22 పరుగులు చేశారు. యశస్వి, చారి రెండేసి వికెట్లు తీశారు. ప్రతిగా శ్రీ ప్రకాష్ జట్టు మూడే వికెట్లు కోల్పోయినా.. 68 పరుగులే చేసింది. చరణ్ సాయి 35 పరుగులతో రాణించాడు.

జ్యోతికి రజతం



రజతం పతకం అందుకున్న జ్యోతి

విశాఖ స్పోర్ట్స్: ఆసియా ఇండోర్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో భారత అథ్లెట్ జ్యోతి రజత పతకాన్ని సాధించింది. కజకిస్తాన్‌లో జరుగుతున్న పదో ఆసియన్ ఇండోర్ అథ్లెటిక్ మీట్‌లో విశాఖకు చెందిన జ్యోతి ఎర్రాజీ వుమెన్ 60 మీటర్ల పరుగును 8.13 సెకన్లలో పూర్తి చేసి ద్వితీయ స్థానంలో నిలిచింది. జపాన్‌కు చెందిన మసూమి అవొకి 8.01 సెకన్లలో పూర్తిచేసి స్వర్ణాన్ని అందుకుంది.

కలకాలం నిలిచేలా కథలు రావాలి



మాట్లాడుతున్న సాహితీవేత్త వాసిరెడ్డి నవీన్

సీతంపేట: రాయాలన్న తపన, తెలుసుకోవాలన్న జిజ్ఞాస ఉండాలే గాని ప్రతి జీవితంలో అంతులేని కథలు ఎన్నో ఉంటాయని ప్రముఖ రచయిత, కథా సాహితి సంపాదకుడు వాసిరెడ్డి నవీన్ అన్నారు. కా.రా. కథా నిలయం 26వ వార్షికోత్సవ సభ ఆదివారం మధ్యాహ్నం విశాఖ పౌరగ్రంథాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన కథా సాహితి ప్రయాణం, కథ పరిణామం అనే అంశంపై ప్రసంగించారు. యువ రచయితలు కేవలం వాళ్ల మానసిక సంఘర్షణలపైనే కథలు రాయడంపై దృష్టిపెడుతున్నారని అన్నారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు సంబంధించిన అంశాలపై ఆలోచన చేయాలని పిలుపునిచ్చారు. కాళీపట్నం రామారావు 60 ఏళ్ల క్రితం రాసిన యజ్ఞం కథ గురించి ఇంకా మాట్లాడుకుంటున్నామంటే దాని గొప్పతనం గురించి ఆలోచించాలన్నారు. ఉత్తమ కథలను క్రమం తప్పకుండా 32 ఏళ్లుగా ప్రచురిస్తూ చరిత్ర సృష్టిస్తున్నామన్నారు. బాలసాహిత్యంపై ప్రముఖ రచయిత బమ్మిడి జగదీశ్వరరావు ప్రసంగించారు. బాలలకు పౌష్టికాహారం ఎంత అవసరమో సాహిత్యం కూడా అంత అవసరంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు భావించాలన్నారు. పిల్లల ఊహా ప్రపంచాన్ని చిదిమేసే పనిని చదువు పేరుతో జరగడం విచారకరమన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ బాలల సినిమాలను పరిచయం చేస్తూ కథా రచయిత శివలక్ష్మి రచించిన 'చిగురంత ఆశ', ఉత్తమ అంతర్జాతీయ సినిమాలపై సమీక్షా సంపుటి 'రియలిస్టిక్ సినిమా'లను రచయిత జయసూర్య ఆవిష్కరించారు. కథా నిలయం కార్యదర్శి దాసరి రామచంద్రరావు మాట్లాడుతూ శ్రీకాకుళంలో ప్రముఖ రచయిత కాళీపట్నం రామారావు సారధ్యంలో స్థాపించిన కథా నిలయంలో 97వేల కథల పుస్తకాలు లభ్యమవుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కథా నిలయం కోశాధికారి కాళీపట్నం సుబ్బారావు, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

'చీకటి పువ్వు' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్త వివినమూర్తి

సీతంపేట (విశాఖ ఉత్తర): మహిళా చేతన కార్యకర్త కత్తి పద్మ రచించిన కథల సంపుటి 'చీకటి పువ్వు' పుస్తకాన్ని ప్రముఖ సాహితీ విమర్శకుడు వివినమూర్తి ఆదివారం పౌర గ్రంథాలయంలో ఆవిష్కరించారు. సాహితీ విమర్శకుడు జి.ఎస్.రామ్మోహన్ మాట్లాడుతూ కత్తి పద్మ నాలుగు దశాబ్దాలుగా ప్రజా జీవనంలో ఉన్నారని, అందుచేతనే ఆమె కథల విస్తృతి చాలా విశాలమైనదని అభిప్రాయం వ్యక్తం చేశారు.

మహిళల సమస్యల పరిష్కారం కోసం పని చేస్తున్న పద్మ.. బాధితుల జీవితాలను దర్శించే పద్ధతి విలక్షణమైనది కనుకనే ఆ వైవిధ్యం కథల్లో ప్రతిబింబించాయన్నారు. కథలు చదువుతుంటే ఆ పాత్రలపై సహానుభూతి పాఠకుల్లో కలుగుతుందన్నారు. రచయిత్రి, న్యాయవాది జహారా మాట్లాడుతూ సాహిత్యం బాధితుల బాధ, దుఃఖాలను ప్రతిబింబించకపోతే పాఠకులను హత్తుకోదన్నారు. ప్రగతిశీల మహిళా సంఘం నాయకురాలు వి.సంధ్య మాట్లాడుతూ పద్మ కథల్లో పాత్రలు సజీవమైనవని పేర్కొన్నారు. చీకటి పువ్వు కథల ఆడియోను కథా రచయిత బమ్మిడి జగదీశ్వరరావు ఆవిష్కరించారు. రచయిత కత్తి పద్మ మాట్లాడుతూ తన కథలు ఉత్తరాంధ్ర మహిళల బాధలను ప్రతిబింబిస్తాయన్నారు. తన కథల్లోని పాత్రలు విషాదాల వలయాల్లో చిక్కుకుని కూడా తమ జీవితాలను నిలబెట్టుకోవడానికి, పరిష్కారాలు సాధించుకోవడానికి ప్రయత్నిస్తాయని తెలిపారు. చీకటి పువ్వు కథా సంకలనాన్ని మిత్ర సాహితి ప్రచురించింది. కార్యక్రమానికి మిత్ర సాహితి సభ్యుడు విశాఖ వర్మ అధ్యక్షత వహించారు.

అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శన



నృత్యం చేస్తున్న చిన్నారులు

బీచ్‌రోడ్డు: లయబద్ధమైన సంగీతం, గాత్రాలకు అనుగుణంగా నృత్యం చేసిన చిన్నారులు నటరాజుకు నీరాజనాలు సమర్పించారు. మయూరి నృత్య నికేతన్ 35వ వార్షికోత్సవం సందర్భంగా కళాభారతిలో ఆదివారం ఏర్పాటు చేసిన నృత్య ప్రదర్శన ఆద్యంతం అలరించింది. చేరి యశోదకు శిశువితడు, చిన్ని శిశువు, ఇట్టి ముద్దులాడి బాలుడేడవాడు.. తదితర గీతాలతో ఆరుగురు బాల కళాకారిణులు అరంగేట్రం చేశారు. తొలి ప్రదర్శనే అయినా సిహెచ్.శ్రీ నిధి, భాను, జాహ్నవి, సన, బేగం, శైవి హావభావాలు పలికిస్తూ ఆకట్టుకున్నారు. గణేశాస్తుతితో ప్రారంభమైన కార్యక్రమంలో కామాక్షి స్తుతితో పాటు అదివో అల్లదివో శ్రీ హరివాసము, శ్రీ రాఘవం, తదితర గీతాలకు నాట్య ప్రదర్శన ఆద్యంతం ఆసక్తిగా సాగింది.

నేడు జీవీఎంసీ స్పందన

డాబాగార్డెన్స్: జీవీఎంసీలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు స్పందన కార్యక్రమం నిర్వహించనున్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్న స్పందన కార్యక్రమాన్ని నగర ప్రజలు వినియోగించుకోవాలని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, కమిషనర్ పి.రాజాబాబు కోరారు.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.57,380
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.52,600
వెండి(కిలో):	రూ.72,700

చికెన్ ధరలు




చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.105
స్కిన్	: రూ.180
స్కిన్‌లెస్	: రూ.190

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	440.00
విజయనగరం	444.00
శ్రీకాకుళం	444.00

దుమ్ము రేగినా ఆగని జీవన పోరాటం



వీఐపీ రోడ్డు సమీపంలో ఓ భారీ భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఎన్ని అత్యాధునిక పరికరాలు వచ్చినా.. నగర పరిధిలో బండరాళ్లు పగలగొట్టాలంటే డ్రిల్లర్లను ఉపయోగించాల్సిందే. దుమ్ము రేగుతున్నా.. జీవన పోరాటం తప్పదన్నట్లుగా.. కార్మికులు ఇలా పని చేస్తున్నారు. -ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

కేజీహెచ్‌కు న్యూ లుక్

- నాడు-నేడు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ నిధులతో హంగులు
- అత్యాధునికంగా ఏఎంసీయూ-2
- 20 పడకలు ఏర్పాటు
- కేజీహెచ్ అభివృద్ధి కలెక్టర్ మల్లికార్జున ప్రత్యేక దృష్టి



భావనగర్ వార్డు ముందు నూతనంగా నిర్మించిన రూఫింగ్



అత్యాధునికంగా తీర్చిదిద్దిన రాజేంద్ర ప్రసాద్ వార్డులోని ఏఎంసీయూ-2 యూనిట్



ఆధునికీకరించిన వార్డులో పేషెంట్‌కు చికిత్స అందిస్తున్న నర్సు

మహారాణిపేట (విశాఖ దక్షిణ): పేదల ఆస్పత్రిగా పేరొందిన కేజీహెచ్‌లో రోగులకు మెరుగైన సౌకర్యాలతో కూడిన వైద్యం అందుతోంది. నాడు-నేడు, ఆస్పత్రి అభివృద్ధి నిధులతో కార్పొరేట్ స్థాయిలో కేజీహెచ్‌ను ప్రభుత్వం తీర్చిదిద్దుతోంది. రోగులకు అవసరమైన పడకలు, తాగునీరు, మరుగుదొడ్లు, బెడ్‌షీట్స్, మందులు ఎప్పుడూ సిద్ధంగా ఉండే విధంగా చర్యలు చేపట్టారు. అత్యాధునిక వైద్య పరికరాల కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోంది. దీనితోడు కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున కేజీహెచ్ అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. ఒక్కొక్క వార్డును అభివృద్ధి చేస్తూ వస్తున్నారు. వార్డుల్లో రోగులకు, వారి సహాయకులకు సదుపాయాలు కల్పిస్తున్నారు. తాజాగా రాజేంద్రప్రసాద్ వార్డు ఏఎంసీయూ-2 విభాగం కార్పొరేట్ లుక్‌ను సంతరించుకుంది.

ఇటీవల కలెక్టర్ మల్లికార్జున కేజీహెచ్‌ను సందర్శించారు. ఒకే మంచంపై ఇద్దరు రోగులను చూసి కలెక్టర్ చలించిపోయారు. రోగుల ఇబ్బందులను స్వయంగా చూసిన ఆయన స్పందించారు. రాజేంద్రప్రసాద్ వార్డును తీర్చిదిద్దేందుకు సహకరించాలని నాటి జనరల్ మెడిసన్ విభాగాధిపతి డాక్టర్ వైజీ సుందరరాజు కలెక్టర్‌ను కోరారు.

దీనికి స్పందించిన కలెక్టర్ రాజేంద్ర ప్రసాద్ వార్డులో ఎక్యూరేట్ మెడికల్ కేర్ యూనిట్-2 (ఎఎంసీయూ-2) నిర్మాణ పనులు చేపట్టాలని ఆదేశించారు. ఆధునీకరణ కోసం రూ.32 లక్షలు మంజూరు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో ఆర్‌పీ వార్డులో రూ.32 లక్షలతో ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య మౌలిక సదుపాయాల సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డీఏ నాయుడు ఆధ్వర్యంలో డీఈ మన్మథరావు వార్డులో మెరుగైన సదుపాయాలు కల్పించారు. పూర్తి ఎయిర్ కండిషన్, మరుగుదొడ్లు, విద్యుత్ పనులు, ఫాల్ సీలింగ్, ఫ్లోరింగ్, నర్సు కౌంటర్లు, ఇతర సదుపాయాలు కల్పించారు. మొత్తం 42 రోజుల్లో డీఈఈ మన్మథరావు ఆధ్వర్యంలో ఈ నిర్మాణ పనులు పూర్తవడంతో ఈ నెల 4న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని ప్రారంభించారు.

తప్పిన ఇబ్బందులు

పేద రోగుల కోసం రాజేంద్ర ప్రసాద్ వార్డులో తాజాగా నిర్మించి ఎక్యూరేట్ మెడికల్ కేర్ యూనిట్ (ఎఎంసీయూ-2) విభాగం కార్పొరేట్ స్థాయిలో నిర్మించారు. రాజేంద్ర ప్రసాద్ వార్డులో ఎక్యూరేట్ మెడికల్ కేర్ యూనిట్-1(ఎఎంసీయూ)లో రోగులతో రద్దీగా ఉంటుంది. మొన్నటి వరకు ఒకే మంచంపై ఇద్దరు రోగులకు చికిత్స అందించేవారు..ఇప్పుడా పరిస్థితి లేదు. ఎఎంసీయూ-2లో 20 పడకలు ఏర్పాటు చేశారు.

రూఫింగ్ నిర్మాణం

అలాగే భావనగర్ వార్డు ముందు రూఫింగ్ నిర్మించారు. రోగులను తీసుకొచ్చే సహాయకులు ఇబ్బందులు పడకుండా భావనగర్ వార్డు నుంచి రేడియాలజీ వార్డుకు రూఫింగ్ నిర్మించారు.